క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



మాజీ సీఎం జగన్‌తో మాట్లాడుతున్న గిరజాల బాబు

కడియం: తాడేపల్లిలోని కార్యాలయంలో గురువారం మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. నిడదవోలు, కొవ్వూరు నియోజకవర్గాల పరిశీలకునిగా తనను నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని, పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని జగన్‌కు వివరించారు.

ఎలుకల నివారణ మందు పంపిణీ



ఎలుకల మందును పంపిణీ చేస్తున్న సర్పంచ్ స్టాలిన్

కడియం: మండలంలోని జేగురుపాడులో గురువారం రైతులకు ఎలుకల నివారణ మందును పంపిణీ చేశారు. రైతు సేవా కేంద్రంలో సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది.

స్టీల్ కంచాల వితరణ



విద్యార్థులకు కంచాలు వితరణ చేస్తున్న దాతలు

కంబాలచెరువు: స్థానిక నాలుగో డివిజన్ మాజీ కార్పొరేటర్ బళ్ల సత్యవతి తన మాతృమూర్తి జిలగం పార్వతి జ్ఞాపకార్థం గురువారం పదో డివిజన్‌లోని మోరంపూడి సిటీ స్పెషల్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ విద్యార్థులకు వంద స్టీల్ కంచాలు వితరణ చేశారు. కార్యక్రమంలో పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బళ్ల శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేవీవీ.సత్యనారాయణ, జిలగం సూర్యారావు, జిలగం వీరవెంకట సత్యనారాయణ, వాణిశ్రీ, కమల్, ఉపాధ్యాయులు పి.రమాశాంతి, అప్పన్నబాబు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ల ప్రతిభ



ఎన్‌సీసీ క్యాడెట్లను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే

కంబాలచెరువు: ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ గర్ల్ క్యాడెట్లు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే గురువారం తెలిపారు. ఆల్ ఇండియా థల్ సైనిక్ క్యాంప్ 2025లో కె.శిరీష విజయవంతంగా పాల్గొని, టెంట్ పిచింగ్‌లో స్వర్ణపతకం గెలుచుకున్నారు. అలాగే అబ్స్టికల్ ట్రైనింగ్‌లో ప్రతిభ చూపిందన్నారు. జడ్జింగ్ డిస్టెన్స్, ఫీల్డ్ సిగ్నల్స్‌లో సీహెచ్.వీర సూర్యదేవి విశేష ప్రతిభ ప్రదర్శించిందన్నారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ అధికారులు లెఫ్టినెంట్ డాక్టర్ ఈసుబ్ బాషా షేక్, డాక్టర్ కె.అనుష పాల్గొన్నారు.

చిత్రకారుడికి ప్రకృతే ప్రేరణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న నఖ చిత్రకారుడు రవి పరస

సీటీఆర్ఐ: చిత్రకారుడు అనేక చిత్రాలను ప్రకృతి నుంచే గీయవచ్చని ప్రముఖ నఖచిత్రకారుడు రవి పరస అన్నారు. గురువారం స్థానిక విజయ శంకర ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాలలో వికసిత్ భారత్–2047, సేవా పర్వం–2025 లో భాగంగా చిత్రకళా సమ్మేళనంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రవి పరస మాట్లాడుతూ మనకి ప్రేరణ ప్రకృతే అన్నారు. చిత్రకారుడికి సృజనాత్మకత ఎక్కువగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస శర్మ, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు తరగతి గదులకు శంకుస్థాపన

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్ సిటీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతులకు రాష్ట్ర టీడీపీ వైద్య విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్ గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రశాంతి, స్టాఫ్ సెక్రటరీ రాముడు, ఎంఈవో–2 చందూ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మో.. జ్వరాలు

- వణికిస్తున్న జ్వరాలు
- పెరుగుతున్న బాధితులు
- ప్రభుత్వాసుపత్రుల్లో రద్దీ



ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

కంబాలచెరువు: నగరంతో పాటు రూరల్ ప్రాంత ప్రజలను వైరల్ జ్వరాలు వణికిస్తున్నాయి. పెద్దసంఖ్యలో చేరుతున్న జ్వర పీడితులతో ఆసుపత్రులు కిక్కిరిసిపోతున్నాయి. రాజమహేంద్రరం ప్రభుత్వాసుపత్రికి వచ్చే కేసుల్లో అధికంగా జ్వర పీడితులే ఉంటున్నారు. మారిన వాతావరణ పరిస్థితులు, అస్తవ్యస్తమైన పారిశుధ్య నిర్వహణ, వర్షాల కారణంగా దోమలు పెరిగిపోవడంతో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. సాధారణ రోజులతో పోల్చితే నాలుగు రెట్లు జ్వర పీడితులు ఆసుపత్రులకు వస్తున్నారు. నగరంలోనే ఈ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. నగరంలోని మెరక వీధి, శంభూనగర్, బృహన్నల పేట, ఆనంద్ నగర్, అంబేడ్కర్ నగర్ ఆరోగ్య కేంద్రాల పరిధిలో డెంగీ కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో చెప్పవచ్చు.

పెరిగిన బాధితులు

ప్రభుత్వాసుపత్రికి నిత్యం 1200 పైగా ఓపీ కేసులు వస్తే, వాటిలో సుమారు 200 వరకు సాధారణ వైద్య విభాగానికి వస్తున్నారు. వీరిలో దాదాపు 60 మంది జ్వర పీడితులే ఉంటున్నారు. తీవ్ర తలనొప్పి, నీరసం, దగ్గు, కీళ్ల నొప్పులు తదితర సమస్యలతో వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉంటోందని వైద్యులు చెబుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత పరిసరాల శుభ్రత పాటించాలని, ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. గతేడాదితో పోలిస్తే డెంగీ పీడితుల సంఖ్య పెరుగుతోంది. జిల్లాలో 2024 మొత్తంగా 18 కేసులు వస్తే.. ఈ ఏడాది ఇప్పటికే 18 కేసులు నమోదయ్యాయి. రాజమహేంద్రరం ప్రభుత్వాసుత్రిలో వార్డులు జ్వర పీడితులతో నిండిపోయాయి.

> **అవసరమైతే ఐసీయూలో చికిత్స**
>
> ఆసుపత్రికి జ్వరంతో వచ్చే వారి సంఖ్య అధికంగానే ఉంటోంది. రెండు జనరల్ వార్డుల్లో బెడ్లు నిండిపోయాయి. వారందరికీ చికిత్స అందిస్తున్నాం. రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి అవసరమైతే ఐసీయూలో ఉంచుతున్నాం. సాధారణంగా ఆసుపత్రికి వచ్చిన వారు ఒకటి, రెండు రోజుల్లో రికవరీ అయి ఇంటికి వెళ్లిపోతున్నారు. కొంతమందికి మాత్రమే ఐసీయూలో చికిత్స అవసరం అవుతోంది.
>
> – డాక్టర్ పీవీవీ సత్యనారాయణ, హెచ్‌వోడీ, జనరల్ మెడిసిన్, ప్రభుత్వాసుపత్రి

కొనసాగుతున్న విద్యుత్ ఉద్యోగుల ఆందోళన



బొమ్మూరులో ధర్నా చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర పవర్ జేఏసీ పిలుపు మేరకు నాలుగో రోజు గురువారం బొమ్మూరు 220 కేవీ సబ్ స్టేషన్‌లో ఏపీ ట్రాన్స్‌కో ఓఅండ్ఎం సర్కిల్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ పీవీ రవికుమార్ మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ వెంటనే చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ నాయకుడు డేవిడ్ రాజు మాట్లాడుతూ పెండింగ్ ఏరియర్స్ ఇవ్వాలన్నారు. జేఏసీ నాయకుడు గుత్తుల అన్నవరం ప్రసాద్ మాట్లాడుతూ శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు రిలే నిరాహార దీక్షలు చేపడతామని వెల్లడించారు. కేవీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను డిపార్టుమెంట్‌లో విలీనం చేయాలని, సమాన పనికి సమానం వేతనం ఇవ్వాలన్నారు. ఆందోళనలో విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నీటి సరఫరాకు రేపు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ ప్రధాన మంచినీటి సరఫరా విభాగంలో ప్రధాన పైపులైన్‌కు మరమ్మత్తు పనుల నేపథ్యంలో శనివారం తాత్కాలికంగా నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఇన్‌చార్జి సూపరింటెండింగ్ ఇంజినీర్ రీటా తెలిపారు. ఈ నేపథ్యంలో రాజేంద్ర నగర్, సుబ్బరావుపేట, నెహ్రూనగర్ తదితర ప్రాంతాలలో శనివారం ఉదయం, సాయంత్రం తాగునీరు సరఫరా కాదన్నారు. తిరిగి 21వ తేదీ ఉదయం నుంచి యథాతథంగా జరుగుతుందన్నారు. అప్పటి వరకూ ఆయా ప్రాంతాలకు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తామన్నారు. వాటర్ ట్యాంకర్లు అవసరమైనవారు అసిస్టెంట్ ఇంజినీర్ (వాటర్ సప్లై) 98499 08350ను సంప్రదించాలన్నారు.

ఎంఆర్‌పీకి మించి మద్యం విక్రయాలు

- నగరంలో పెరిగిపోయిన బెల్టుషాపులు
- మాజీ ఎంపీ భరత్ రామ్ ధ్వజం



రాజమహేంద్రవరం సిటీ: మద్యం పాలసీ గురించి గొప్పలు చెప్పుకొనే కూటమి ప్రభుత్వంలో ఎంఆర్‌పీకి మించి మద్యం విక్రయాలు జరుగుతున్నాయని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ అన్నారు. ఆయన గురువారం మాట్లాడుతూ అధిక ధరలకు మద్యం అమ్మకాలపై మద్యపాన ప్రియుల నుంచి వస్తున్న ప్రశ్నలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఈ నెల 12 నుంచి ఎంఆర్‌పీ కంటే రూ.10 పెంచి విక్రయిస్తున్నారన్నారు. ఇప్పటికే ఒక సమయం, సందర్భం లేకుండా యథేచ్ఛగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారని, మద్యం షాపుల లోనే కాకుండా చుట్టూ పక్కల మందుబాబులు తప్పతాగి ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నా ఏమాత్రం చర్యలు లేవన్నారు. చివరకు యువకులు తప్పతాగి, నగర నడిబొడ్డున పోలీసులపైనే దాడులకు దిగడం కూడా ఇటీవల చూశామన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో రాత్రి 8 గంటలు దాటితే మద్యం షాపులు మూతపడేవన్నారు. కూటమి పాలనలో నగరంలో బెల్ట్ షాపులు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయాయన్నారు.

సబ్సిడీ షెడ్లకు కేటగిరీ – 2 విద్యుత్ బిల్లులా!

కడియం: కేంద్ర ప్రభుత్వం గోకులం పథకం ద్వారా పాడి రైతులకు 90 శాతం సబ్సిడీపై గేదెల షెడ్డులను నిర్మించిందని.. అయితే ఇలా సబ్సిడీపై వేసుకున్న షెడ్లకు విద్యుత్ కనెక్షన్ కావాలని దరఖాస్తు చేసుకుంటే కేటగిరీ 2 కింద మాత్రమే ఇస్తామని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారని వైఎస్సార్ సీపీ కడియం మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ అన్నారు. ఆయన గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ కనెక్షన్‌కు దాదాపు రూ.ఆరు వేలు డిపాజిట్ కట్టాలని చెబుతున్నారన్నారు. రైతులు రూ.పదివేలు చెల్లిస్తే 90 శాతం కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చి రూ.లక్ష విలువైన ఈ షెడ్లను నిర్మించారన్నారు. అటువంటింది కేవలం విద్యుత్ కనెక్షన్ కోసం రూ.ఆరువేలు చెల్లించాలంటే సామాన్య రైతులకు ఎలా సాధ్యమని ప్రశ్నించారు. రైతులు సొంతంగా వేసుకునే తాటాకు పాకలకు కూడా కేటగిరీ 2 కింద మాత్రమే విద్యుత్ కనెక్షన్లు ఇస్తామంటున్నారన్నారు. డిపాజిట్ చెల్లించడంతో పాటు, ప్రతి నెలా కేటగిరీ 2 కింద వచ్చే వేల రూపాయల విద్యుత్ బిల్లును చెల్లించడం రైతులకు తలకుమించిన భారం అవుతుందన్నారు. సామాన్య రైతులు నిర్మించుకునే తాటాకు పాకలు, గోకులం షెడ్లకు కేటగిరీ 1 కింద విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయాలని, సంబంధిత కూటమి ప్రజాప్రతినిధులు ఈ విషయంపై స్పందించి రైతులకు న్యాయం చేయాలని స్టాలిన్ డిమాండ్ చేశారు.

పలువురికి వైద్య పరీక్షలు



కడియంలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కడియం: మహిళల ఆరోగ్య సంరక్షణకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నారీ స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం కడియం, దుళ్ల గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించారు. వైద్యాధికారులు ఎస్.జెస్సీ సుప్రియ, ఎం.మణిజ్యోత్స్న తమ సిబ్బందితో కలిసి మహిళలు, కిశోర బాలికలు, వృద్ధులకు వైద్య పరీక్షలు చేశారు. కడియంలో 146 మందికి, దుళ్లలో 107 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేసినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమాల్లో కడియం సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఉప సర్పంచ్ వెలుగుబంటి రఘురామ్, దుళ ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, ఎంపీటీసీ కట్టుంగ నాగరాజు, మాజీ సర్పంచ్ గుర్రప్పు సత్యనారాయణ, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు.

- ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ మంతెన గార్డెన్స్ వీధులు, సంగీత వెంకట రెడ్డి స్ట్రీట్స్, భాను టెక్స్‌టైల్స్ వీధి, ఆదిరెడ్డి అప్పారావు వీధి, ప్రగతి మార్గ్, షిరిడీ సాయి మార్గ్, జేఎన్ రోడ్డు, ఏకేసీ కాలేజ్ రోడ్డు, సాయిబాబా టెంపుల్ తిలక్ రోడ్డు పరిసర ప్రాంతాలలో సరఫరా ఉండదు.
- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ హుకుంపేట, కార్తికేయ నగర్, వరలక్ష్మీ నగర్, వెంకటగిరి, ఆదిత్య నగర్, బాపూజీ నగర్, గణేష్ నగర్, హనుమాన్ నగర్, సాయి నగర్, గాయత్రీ నగర్, ఆల్కాపురి, సాయిబాబా పుంత, పాములగుడి, గంగిరెడ్ల పేట, అరవింద్ నగర్, ఎస్సీ పేట, డెయిరీ కాలనీ, పిట్లవాని చెరువు ఏరియా, బుచ్చయ్య నగర్, మల్లిన నగర్, గాదాలమ్మ నగర్, మోరంపూడి నుంచి నామవరం రోడ్డు ఏరియా ప్రాంతాలలో అంతరాయం కలుగుతుంది.
- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నగరంలోని మెయిన్ రోడ్డు, కోటగుమ్మం, పప్పుల వీధి, సీతమ్మ సందు, ఆనపపిండి వారి వీధి, ఖాజీ వీధి, చాంబర్ ఆఫ్ కామర్స్, నాళం భీమరాజు వీధి, నల్ల మందు సందు, ఉల్లితోట వీధి, అజ్జరపువారి వీధి, బారు వారి వీధి, టి.నగర్, టౌన్ హాల్ రోడ్, సెంట్రల్ విజటబుల్ మార్కెట్, సూరాబత్తుల వారి వీధి, వంకాయల వారి వీధి, గీతా భవనం, వీరేశలింగం జన్మగృహం ఏరియా, అష్టలక్ష్మి గుడి వీధి, మెయిన్ రోడ్డులో విద్యుత్ ఉండదు.
- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ కొంతమూరులోని నూకాలమ్మ గుడి ప్రాంతం, ముస్లిం పేట, అంబేడ్కర్ పేట, అఫీషియల్ కాలనీ, పంచాయతీ ప్రాంతం, కాతేరు రోడ్డు, బ్రాహ్మణ అగ్రహారం, బూసమ్మ కాలనీ, శ్రీరామ్ నగర్, బీసీ కాలనీ, వీవీ కొండయ్య లేఅవుట్, కాతేరులోని బ్రాహ్మణ అగ్రహారం, రాయడుపాకలు, పరిమినగర్, బొమ్మన కాలనీ, ఫోర్ట్ బ్రిడ్జి ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది.
- ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మునిసిపల్ ఆఫీస్ ఏరియా, కోర్టు ప్రాంతం, గోకవరం బస్టాండ్, ఆర్యాపురం, కోర్లంపేట, దేవీ చౌక్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ కోత విధిస్తారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన ఆట్యా–పాట్యా ఆటల పోటీల్లో రాష్ట్రస్థాయికి ఐదుగురు బాలికలు, 11 మంది బాలురను ఎంపిక చేశారు. ఆ క్రీడా సంఘ అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.రత్నకళ, వ్యాయామ ఉపాధ్యాయిని టి.సుజాత పాల్గొన్నారు.

వికాస ఆధ్వర్యంలో రేపు జాబ్ మేళా

రాజమహేంద్రవరం సిటీ: కలెక్టరేట్ పరిసరాల్లోని వికాస కార్యాలయం (బొమ్మూరు హార్లిక్స్ ఫ్యాక్టరీ ఎదురుగా)లో శనివారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఈ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వికాస పీడీ లచ్చారావు మాట్లాడుతూ డెల్టా హాస్పిటల్స్‌లో జీఎన్ఎం, నర్సింగ్, ల్యాబ్ టెక్నీషియన్, ఐసాన్ ఎక్స్‌పీరియన్స్ కంపెనీలో టెలి సేల్స్ రిప్రజెంటేటివ్, డెక్కన్ కెమికల్స్‌లో ట్రైనీ (ప్రొడక్షన్ – మెకానికల్ మెయింటెనెన్స్), ఇసుజు, వియాష్ లైఫ్ సైన్సెస్, జేకే ఫిన్నర్, హ్యూండాయ్ మోబిస్ కంపెనీల్లో టెక్నీషియన్ పోస్టులు, ఫాక్స్కాన్ కంపెనీలో మొబైల్ ఆపరేటర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీఎస్సీ నర్సింగ్, ఎంఎల్టీ, జీఎన్ఎం, బీటెక్ ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.12 వేల నుంచి రూ.20 వేల వేతనంతో పాటు ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సదుపాయాలు ఆయా సంస్థల ప్రకారం అందజేయబడతాయన్నారు. వివరాలకు 77993 76333 నంబరును సంప్రదించాలన్నారు.

పోలీసుల అన్నసమారాధన



అన్నం వడ్డిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్



అన్నసమారాధనలో పాల్గొన్న కేశవభట్ల శ్రీనివాసరావు

కంబాలచెరువు: వినాయక చవితిని పురస్కరించుకుని రాజమహేంద్రవరం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో గురువారం అన్నసమారాధన నిర్వహించారు. ఎస్పీ డి.నరసింహ కిశోర్ ముఖ్యఅతిథిగా హాజరై.. భక్తులకు భోజనాలను వడ్డించారు. సుమారు వెయ్యి మంది అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఎంబీఎన్ మురళీకృష్ణ, త్రీటౌన్ సీఐ వి.అప్పారావు, వన్‌టౌన్ సీఐ ఎన్.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన మహోన్నతం

రాజమహేంద్రవరం సిటీ: అన్నసమారాధన మహోన్నతమైనదని కేశవభట్ల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, రైల్వే విశ్రాంత చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ కేశవభట్ల శ్రీనివాసరావు అన్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని గురువారం రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో కనకదుర్గ ఆటో ఓనర్స్ అండ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేశవభట్ల శ్రీనివాసరావు హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ బొలిశెట్టి సత్యనారాయణ (బాక్స్ ప్రసాద్), రైల్వేస్టేషన్ సీటీఐ సుంకర చంద్రమౌళి, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బిల్డర్ శ్రీను, బోను శివ పాల్గొన్నారు.

క్లాత్ సంచులపై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ రామలింగేశ్వర్

రాజమహేంద్రవరం సిటీ: పర్యావరణ రక్షణలో భాగంగా నగరంలోని వీధి వ్యాపారస్తులందరికీ క్లాత్ సంచుల వినియోగంపై అవగాహన కల్పించాలని మెప్మా సిబ్బందికి అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు (సీఓలు), క్లాత్ బ్యాగుల తయారీదారులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనపనార, గుడ్డ సంచులను వాడటం ద్వారా ప్లాస్టిక్‌ను పూర్తిగా దూరం చేయవచ్చన్నారు. నగరంలో కొన్ని మహిళా సంఘాలు జనుముతో ఆకట్టుకునే సంచులు తయారుచేస్తూ స్వయం ఉపాధి పొందుతున్నారన్నారు. ప్రణాళికబద్ధంగా అన్ని సమాఖ్యల ద్వారా నగరంలో క్లాత్ బ్యాగుల వాడకం పెరిగితే, మహిళలకు ఉపాధి దొరికే అవకాశాలు మరింత మెరుగవుతాయన్నారు. మరోవైపు ఇంటి నుంచి ఉత్పత్తి అయ్యే చెత్తతో ఎరువు తయారు చేసుకుని (హోం కంపోస్టింగ్) మొక్కలకు వినియోగించుకునే విధానంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. టెర్రస్ గార్డెనింగ్ గురించి ప్రజలకు వివరించాలని, ఇప్పటికే ఇంటి పైకప్పు, బాల్కనీ వంటి ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు, కూరగాయలు, పండ్లను పెంచుతున్న వారి వివరాలు సేకరించాలన్నారు. సమావేశంలో సీఎంఎం వి.రామలక్ష్మి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, పలువురు జ్యూట్ సంచుల తయారీదారులు పాల్గొన్నారు.

ఘనంగా పౌష్టికాహార వారోత్సవాలు



చినకొండేపూడిలో వంటకాలను ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

సీతానగరం: మండలంలోని చినకొండేపూడి సచివాలయం –2లో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. చినకొండేపూడి, పెదకొండేపూడిలోని ఏడు అంగన్‌వాడీ కేంద్రాలు సంయుక్తంగా ఈ కార్యక్రమం జరిపారు. ఆకు కూరలతో చేసిన వంటలు, రాగి లడ్డూ, బాలామృతంతో తయారు చేసిన లడ్డూలు, కేకలను ప్రదర్శించారు. పీహెచ్‌సీ వైద్యుడు ఏవీకే చైతన్య, హెల్త్ సూపర్‌వైజర్ సుధాకర్, ఏఎన్ఎంలు సందర్శించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు కె.సుభాషిణి, జేఈ రాణి, ఎ.మంగ కుమారి, వి.సునీత, వి. శాంతి కుమారి, కె.సీత, కె.ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు



పెదపూడిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ దుర్గాలక్ష్మి

పెదపూడి: వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించి, సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని రైతులకు వ్యవసాయ శాఖ కాకినాడ ఏడీ దుర్గాలక్ష్మి సూచించారు. మండల వ్యవసాయాధికారి ఎన్.సత్యప్రసాద్ అధ్వర్యంలో గురువారం పెదపూడిలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిత్ర పురుగులను సంరక్షించుకోవాలని, శత్రు పురుగులను నిర్మూలన చేయాలని ప్రయోగాత్మకంగా వివరించారు. నానో యూరియా వాడకంతో రైతుకు శ్రమ, వ్యయం తగ్గుతుందని, దీనిపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం స్థానిక గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నానో యూరియా ఉపయోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాసు గౌడ్, వీఏఏలు దుర్గాప్రసాద్, శరణ్య, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలన

బిక్కవోలు: ఫౌండేషన్ న్యూమరసీ అండ్ లిటరసీ కార్యక్రమంలో భాగంగా తొస్సిపూడి ప్రాథమిక పాఠశాలలో ఒకటి, రెండు తరగతుల విద్యార్థులకు బోధన, అభ్యసన కార్యక్రమాల అమలు తీరును బొమ్మూరులోని జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) అధ్యాపకుడు సత్య ప్రకాష్ పరిశీలించారు. అలాగే అనపర్తిలోని బాపనమ్మ గుడి వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాలనూ సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థులకు బోధనా విధానం, విజువల్ మోటార్ లెర్నింగ్ సమస్యలు ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి ఎలా బోధన చేయాలో ఆయా ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట అనపర్తి మండల విద్యాశాఖాధికారి ఎస్.సత్తిరెడ్డి తదితరులు ఉన్నారు.

ముగిసిన గురుచరిత్ర పారాయణ యజ్ఞం

రాజానగరం: అన్నదాన సాయిగా పేరొందిన స్థానిక షిరిడీ సాయిబాబా మందిరంలో గురు పౌర్ణమి నుంచి ప్రారంభమైన గురు చరిత్ర పారాయణ యజ్ఞం ఈ గురువారంతో ముగిసింది. ప్రపంచ శాంతి, లోక కల్యాణార్థం స్థానిక సాయి భక్త మండలి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో 10 గురువారాలు గురు చరిత్రను, ఒక వారం సాయి సచ్చరిత్రను పారాయణ చేశారు. ప్రతి గురువారం తెల్లవారుజామున ఇచ్చిన కాకడ హారతి అనంతరం ఉదయం 6 గంటలకు పారాయణను ప్రారంభించి, మధ్యాహ్నం 2.30 గంటలకు పూర్తి చేస్తూ వచ్చారు. గత 15 సంవత్సరాలుగా ఈ పారాయణ యజ్ఞం జరుగుతోందని భక్తమండలి సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా పారాయణలో పాల్గొన్న భక్తులందరికీ ఆలయంలో కొలువైన దేవతామూర్తుల శేష వస్త్రాలను కానుకగా అందజేశారు.

సినిమాలు



శ్యామల	: కిష్కింధపురి
సూర్యమినీ	: బ్యూటీ
సూర్యప్యాలెస్	: డిమోన్ స్లేయర్
స్వామి	: మిరాయ్
అనుశ్రీ	: బ్యూటీ
శివజ్యోతి	: వీరచంద్రహాస
రాజా	: మిరాయ్
ఊర్వశి	: లిటిల్‌హార్ట్స్.
మేనక	: టన్నెల్
రంభ	: మిరాయ్
అప్సర	: కొత్తలోక, దక్ష
అశోక	: భద్రకాళీ
నామవరం	
వీఎస్ మహల్	: మిరాయ్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: మిరాయ్, కిష్కింధపురి
కడియం	
వెంకటసూర్య	: కిష్కింధపురి